# వర్షమూ – వెన్నెల – ఊరు

అర్ధరాత్రి హఠాత్తుగా వర్షం వెలుస్తుంది.

కొంగ రెక్కల్లోంచి ఈకలా మెల్లగా...

జారిపడుతుంది ఊరు

వెన్నెల్లో మేల్కొంటుంది.

ఇంటి పక్కన తడుస్తూ వున్న గాలితో

తుమ్మ చెట్టూ

దాని వంక చూస్తూ నా నిశ్శబ్దమూ...

తుమ్మాకుల్లోంచి జారే వర్షబింబాల్లో వెన్నెల తేలుతూ...

అరికాలి అడుగుల్లోంచి తల మీది సుడిదాకా

ఆపాదమస్తకమూ – నేను లేని నా శబ్దమూ...

మైసమ్మగుట్ట వెన్నెముక వెనకాల నుంచి వెన్నెల,

నీలపు చీకట్లను ఆర్పుతూ...

వేల యుగాల జ్ఞాపకాల అదృశ్య ప్రస్తారాలు

హోరు సలుపుతూ

దూరంగా...

ఎర్రమల్లి వాగు కాలి మడమల పై నుంచి

జారే తడుల ఇసుక తంత్రులు

దేహంలోని కుందేలు పిల్లల్ని సుతారంగా లేపుతూ...

ఊరవతలి చించెరువు చెలక మీంచి,

చనిపోయిన నాయనమ్మ అన్నం తినమని

ప్రేమగా పిలుస్తూ...

అర్ధరాత్రి ఆశ్చర్యంగా వర్షం తిరిగి కురుస్తుంది.

వెన్నెలై కుదిపేస్తుంది.

శరీరపు రంధ్ర రంధ్రాల్లో అలుముకుపోయే

జాబిల్లి తోటలు

కుమ్మరి గుడిసెల చుట్టూ ముడుచుకుపోయే తెల్లటి కోటలు

'మదార్ బీ' పెరట్లో తడిసిన సంపెంగ చెలమలోని

గుస గుసలు

తెలియని ఆకాశపు చీకటి దీపం మీదికి

మిణుగురుల్లా దూసుకుపోయే చూపులు

నీలపు కిటికీ వెనుక వొంటరిగా పావురపు మేఘం

తడిసిన మట్టి గోడల పరిమళాల్లోంచి,

రక్తాలని ఆర్పే వొంటరితనంతో ఊరు

పెద్ద బావి గట్టు నుంచి ముసలి కప్ప గీరగా కదులుతూ

ఊరు ఊరంతా మెరసిన వానలో,

వెలిగిన వెన్నెల దీపంపై

ఒక్కడిగా...

మలినం కాని నా జ్ఞాపకమే నాకు దారి

ఆ జ్ఞాపకమే నా దారి

సిద్ధార్థ

('దీపశిల' – 1994)